సాక్షి
ప్రకాశం
సోమవారం । 31 । జూలై । 2023



వైద్యం మరింత మెరుగ్గా

దర్శి సీహెచ్‌సీని రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి చేస్తోంది. ఇప్పటికే 30 నుంచి 50 పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేసింది. రూ.2.10 కోట్లతో నూతన భవనం సిద్ధమైంది. - 8లో..



వివాహిత ఆత్మహత్య

చెట్టుకు ఉరివేసుకుని వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన ముండ్లమూరులో ఆదివారం చోటుచేసుకుంది. - 8లో..

గరిష్టం/కనిష్టం
34/28

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. చల్లని గాలులు వీస్తాయి. వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

నేడు జాతీయ విద్యావిధానంపై చర్చావేదిక

ఒంగోలు: దేశంలో జాతీయ విద్యా విధానం 2020ను ప్రవేశపెట్టి మూడేళ్ల అయిన సందర్భంగా సుపరిపాలన వేదిక ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం 4 గంటలకు స్థానిక కాపు కళ్యాణ మండపంలో చర్చావేదిక నిర్వహిస్తున్నట్లు సుపరిపాలన వేదిక అధ్యక్ష, కార్యదర్శులు మాగులూరి నాగేశ్వరరావు, చిట్టెం వెంకటేశ్వర్లు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ మారెడ్డి అంజిరెడ్డి, జిల్లా పరిషత్ విద్యాశాఖ అధికారి సామా సుబ్బారావు ముఖ్య అతిథులుగా వస్తున్నారన్నారు. వీరితోపాటు పలువురు విద్యావేత్తలు, వివిధ ఉపాధ్యాయ, అధ్యాపక విద్యార్థి, అభ్యుదయ సంఘాల ప్రతినిధులు పాల్గొనాలని కోరుతున్నామన్నారు.

మహిళలపై జరిగే హింసను అరికట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న పుల్లారావు

ఒంగోలు టౌన్: మహిళలపై జరిగే హింసను అరికట్టాలని, జనవిజ్ఞాన వేదిక జిల్లా ఉపాధ్యక్షుడు ఏవీ పుల్లారావు డిమాండ్ చేశారు. స్థానిక ఎల్బీజీ భవన్‌లో ఆదివారం ఐద్వా ఆధ్వర్యంలో నిర్వహించిన రౌండ్ సమావేశంలో ఆయన ప్రసంగించారు. మారుతున్న సమాజంలో మహిళలు అన్నీ రంగాల్లో దూసుకొనిపోతున్నా అదేస్థాయిలో మహిళలపై హింస పెరగడం విచారకరమన్నారు. అసమానతలు, అవమానాలు, అత్యాచారాలు కొత్త రూపాల్లో దాడి చేస్తున్నాయన్నారు. దేశంలో సగటున రోజుకు 86 అత్యాచారాలు, మహిళలపై గంటకు 49 నేరాలు జరుగుతున్నాయని తెలిపారు. దిశ పోలీసు స్టేషన్లలో రోజుకు 20 కేసుల వరకు నమోదవుతున్నాయని, నేరస్తులకు ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా శిక్షలు విధించాలని, శిక్షా కాలాన్ని పెంచాలని కోరారు. సమావేశానికి ఐద్వా జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి అధ్యక్షత వహించగా పి.కల్పన, ఎ.సీతామహాలక్ష్మి, బి.రాజ్యలక్ష్మి, జి.కళ్యాణి, వి.సుశీల, జి.శ్రీదేవి, రఘురాం, శ్రీరాం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

గతంలో ఎన్నడూ చూడని పొగాకు ధరలు



ఈ ఫొటోలోని వ్యక్తి కొండపి మండలం అనకర్లపూడి గ్రామానికి చెందిన పొగాకు రైతు పెద్దినేని సింగయ్య. ఈ ఏడాది 10 ఎకరాల సొంత భూమితో పాటు మరో 20 ఎకరాల కౌలుకు భూమిని తీసుకున్నాడు. మూడు బ్యారన్‌ల పొగాకు సాగు చేశాడు. కౌలు, దున్నకం, నారు, సత్తువ మందులు, కట్టెలు, కూలీలు, కాల్పు, గ్రేడింగ్ మొత్తంగా బ్యారన్‌కి రూ.9 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు ఖర్చు చేసుకున్నాడు. ఈ ఏడాది ఎక్కువ దిగుబడి రావటంతో బయట అదనంగా బ్యారన్ తీసుకుని పొగాకు కాల్చుకున్నాడు. ఎర్రపొలం కావటంతో ఎకరాకు 5 నుంచి 6 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. తొలుత ఉత్పత్తి ఖర్చులు ఎక్కువయ్యాయని ధరలు ఎలా ఉంటాయోనని మదనపడ్డాడు. కాలం కలిసి వచ్చింది. అంతర్జాతీయ మార్కెట్ ప్రభావంతో ఊహించని ధరలు లభించాయి. ప్రారంభంలో మేలిమి రకం పొగాకు ధర కేజీ రూ.180తో ప్రారంభమై క్రమేపీ ధరలు పెరుగుతూ వచ్చి రూ.275 చేరుకుంది. దీంతో బ్యారన్ పొగాకుకు ఖర్చులు పోను రూ.3 లక్షల నుంచి రూ.4 లక్షల వరకు ఆదాయం మిగులుతోంది. మూడు దశాబ్దాలుగా పొగాకు సాగు చేస్తున్నా ఎప్పుడూ పది రూపాయలు మిగలని పరిస్థితి నుంచి ఈ ఏడాది రూ.లక్షల్లో ఆదాయం రావటంతో సింగయ్య ఆనందానికి అవధుల్లేవు.

- పొగాకు పంట చరిత్రలో రికార్డు ధరలు
- ఉత్తర ప్రాంత నల్లరేగడి నేలలు, తేలికపాటి నేలల్లో పొగాకుకు అత్యధికంగా కిలో రూ.288
- దక్షిణ ప్రాంత నేలల్లో అత్యధికంగా కిలో రూ.275
- మాండూస్ నష్టం నుంచి లాభాల వైపు
- రైతులను ఆదుకునేందుకు సీఎం వైఎస్ జగన్ ప్రత్యేక శ్రద్ధ
- కేంద్రాన్ని ఒప్పించి పెనాల్టీలు రద్దు చేయించిన ముఖ్యమంత్రి
- గతంలో మార్క్‌ఫెడ్‌ను రంగంలోకి తెచ్చి రైతుకు అండగా నిలిచి
- అప్పటి నుంచి వ్యాపారుల్లో పెరిగిన పోటీ

పొగాకు బంగారమాయే..

సరిగ్గా ఐదేళ్ల కిందట పొగాకు సాగుచేయాలంటే రైతులు భయపడేవారు. పెట్టుబడులు రాక నష్టాలపాలయ్యేవారు. నాడు పగాకుగా ఉన్న పొగాకు నేడు బంగారమైంది. రైతుకు కాసుల వర్షం కురిపిస్తోంది. ఎన్నడూ లేనంతగా ధరలు పలుకుతూ రికార్డుల ప్రభంజనం సృష్టిస్తోంది. దీనికి తోడు రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంతో మాట్లాడి పెనాల్టీలు తగ్గించడంతో రైతుల్లో ఆనందం వెల్లివిరుస్తోంది.



సాక్షి ప్రతినిధి, ఒంగోలు: పొగాకు రైతు పంట పండింది... గతంలో ఎన్నడూలేని విధంగా ఈ ఏడాది అత్యధిక ధర రావటంతో రైతు లోగిళ్లలో ఆనందం వెల్లివిరుస్తోంది. పొగాకు పంట చరిత్రలో ఏనాడూ ఇంత మెరుగైన మార్కెట్ జరగలేదు. కిలో పొగాకు అత్యధికంగా రూ.288 పలికింది. అదనపు పంటపై పొగాకు బోర్డు విధించే పెనాల్టీలను సీఎం జగన్ కేంద్రంతో మాట్లాడి తగ్గించేలా చేశారు. మార్క్‌ఫెడ్‌ను రంగంలోకి దించి వ్యాపారుల మధ్య పోటీని పెంచారు. వీటన్నింటికి తోడు అంతర్జాతీయ మార్కెట్‌లో పొగాకు డిమాండ్ రైతులకు మరింత కలిసొచ్చి లాభాలు పండించింది.

రాష్ట్రంలో దక్షిణ ప్రాంత నల్లరేగడి నేలలు, తేలికపాటి నేలల్లో పొగాకును పండిస్తారు. ప్రకాశం, గుంటూరు, నెల్లూరు జిల్లాల్లో ఈ తరహా పంట పండుతుంది. ఉత్తర ప్రాంత నల్లరేగడి నేలలు, తేలికపాటి నేలలు ఉన్న తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో కూడా పొగాకు పండిస్తారు. ప్రకాశం, నెల్లూరు, గుంటూరు ఉమ్మడి జిల్లాల్లో కలిపి 11 పొగాకు వేలం కేంద్రాలతో పాటు తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో మరో ఐదు ఉన్నాయి.

కిలో అత్యధిక ధర రూ.288

గతంలో ఎన్నడూ లేనివిధంగా కిలో పొగాకుకు వేలంలో రూ.288 అత్యధిక ధర వచ్చింది. ఉత్తర ప్రాంత నల్లరేగడి నేలలు (ఎన్‌బీఎస్), తేలికపాటి నేలల్లో (ఎన్ఎల్ఎస్) పండిన పొగాకు కిలో సరాసరి ధర రూ.236 పలికింది. ఇది కూడా ఆల్‌టైం రికార్డే. తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లోని ఐదు వేలం కేంద్రాల పరిధిలో 12,865 మంది రైతులు 22,273 హెక్టార్లలో పొగాకును పండిస్తారు. మొత్తం 14,800 బ్యారన్లు ఉన్నాయి. ఈ ఏడాది ఎన్‌బీఎస్ పరిధిలో 107 మిలియన్ కిలోలు, ఎన్ఎల్ఎస్ పరిధిలో 54 మిలియన్ కిలోల పొగాకు ఉత్పత్తి అయింది. మొత్తం మీద 161 మిలియన్ కిలోల పొగాకు దిగుబడి వచ్చింది. ఎస్ఎల్ఎస్ పరిధిలో వచ్చిన దిగుబడిలో ఇప్పటి వరకు 44 మిలియన్ కిలోల పొగాకును వేలం కేంద్రాల ద్వారా విక్రయించారు. గతంలో అత్యధిక ధర కిలో పొగాకుకు రూ.245 దక్కింది. అప్పట్లో సరాసరి ధర రూ.191 మాత్రమే. దక్షిణ ప్రాంత నల్లరేగడి నేలలు (ఎస్‌బీఎస్), దక్షిణ ప్రాంత తేలికపాటి నేలల్లో (ఎస్ఎల్ఎస్) కూడా కిలో అత్యధికంగా రూ.275 పలికింది. అదేవిధంగా ఈ నేలల్లో పండిన పొగాకుకు సరాసరి ధర రూ.207 దక్కింది. గతంలో కిలో పొగాకు అత్యధిక ధర రూ.204 వరకు వచ్చింది. అప్పట్లో సరాసరి ధర కిలో పొగాకుకు రూ.165 మాత్రమే వచ్చింది. గతంలో వచ్చిన అత్యధిక ధరకంటే ఇప్పుడు సరాసరి ధర కూడా ఎక్కువగానే ఉంది. మొత్తం 24,353 పొగాకు బ్యారన్లు ఉన్నాయి. వాటి పరిధిలో 30,240 మంది రైతులు పొగాకు పండిస్తున్నారు. పొగాకు బోర్డు నిర్దేశించిన ప్రకారం 58,300 హెక్టార్లలో పొగాకు సాగు చేయాల్సి ఉండగా, 63,482 హెక్టార్లలో పొగాకును సాగు చేశారు. 5,182 హెక్టార్లలో పొగాకును అదనంగా సాగు చేశారు. ఇప్పటి వరకు 107 మిలియన్ కేజీల పొగాకును వేలం కేంద్రాల ద్వారా విక్రయించారు. మరో 12 మి.కేజీల కొనుగోళ్లు చేపడుతున్నారు.

ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా జంగారెడ్డిగూడెం ఒకటో వేలం కేంద్రంలో అత్యధికంగా కిలో రూ.288 ధర పలికింది. అలాగే మిగిలిన నాలుగు కేంద్రాల్లో రూ.287 చొప్పున అత్యధిక ధర పలికింది.

మాండూస్ తుఫాన్ నష్టం నుంచి..

2022–23 రబీ సీజన్‌లో వచ్చిన మాండూస్ తుఫాన్ కారణంగా దక్షిణ ప్రాంత తేలికపాటి, నల్లరేగడి నేలల్లో పండించిన పొగాకు రైతులకు తీవ్ర నష్టం సంభవించింది. ముందు వేసిన పంట వర్షాలకు ఉరకెత్తటంతో పొగాకు పంటను పూర్తిగా పీకేయాల్సి వచ్చింది. అందుకోసం పంటను రెండో సారి వేశారు. దీంతో ఒక్కో రైతుకు రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు అదనపు భారం పడింది. నాడు భారం పడినా నేడు అదే కలిసి వచ్చింది. నిర్దేశించిన పంట లక్ష్యంకంటే అదనంగా 5,182 హెక్టార్లలో పంట సాగు చేశారు. పొగాకు బోర్డు నిర్దేశించిన పంట ఉత్పత్తి లక్ష్యం 87.61 మిలియన్ కేజీలు. అయితే 107 మిలియన్ కిలోల పొగాకు పంట దిగుబడి వచ్చింది. అంటే 19.39 మిలియన్ కిలోల పొగాకు అదనంగా వచ్చిందన్నమాట.

మార్క్‌ఫెడ్ రాకతో వ్యాపారుల్లో పెరిగిన పోటీ:

పొగాకు వేలంలో గుత్తాధిపత్యాన్ని లేకుండా చేయటంతో పాటు రైతులను నిలువు దోపిడీ చేస్తున్న పొగాకు వ్యాపారులకు సీఎం వైఎస్ జగన్ చెక్ పెట్టారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో వ్యాపారులు పొగాకు రైతులను దోచుకుంటున్నా అప్పటి సీఎం చంద్రబాబు నాయుడు కనీసం పట్టించుకున్న పాపాన పోలేదు. టీడీపీ హయాంలో పొగాకు రైతులు నష్టాల పాలవుతూనే వచ్చారు. దీనిని గమనించిన సీఎం వైఎస్ జగన్ గత 2020–21 సంవత్సరంలో ప్రభుత్వ రంగ సంస్థ మార్క్‌ఫెడ్‌ను రంగంలోకి దించారు. అందుకోసం ప్రత్యేకంగా రూ.220 కోట్లు విడుదల చేశారు. లో గ్రేడ్ పొగాకును కూడా ఎక్కువ ధరకు కొనుగోలు చేసి రైతులను ఆదుకున్నారు. అప్పటి నుంచి వేలంలో పొగాకు వ్యాపారులు పోటీపడి కొంటున్నారు. దీంతో రైతుకు మంచి ధర వస్తోంది.

దక్షిణ ప్రాంత నల్లరేగడి, తేలిక పాటి నేలల్లో పండిన పొగాకు అత్యధిక ధరలు...వేలం కేంద్రాల వారీగా (కిలో పొగాకుకు)

వేలం కేంద్రం		అత్యధిక ధర(రూ)
ఒంగోలు–1	(ప్రకాశం జిల్లా)	275
ఒంగోలు–2	(ప్రకాశం జిల్లా)	273
టంగుటూరు	(ప్రకాశం జిల్లా)	273
కొండపి	(ప్రకాశం జిల్లా)	272
పొదిలి	(ప్రకాశం జిల్లా)	272
కనిగిరి	(ప్రకాశం జిల్లా)	271
వెల్లంపల్లి	(ప్రకాశం జిల్లా)	271
కందుకూరు– 1	(నెల్లూరు జిల్లా)	271
కందుకూరు– 2	(నెల్లూరు జిల్లా)	271
డిసీ పల్లి	(నెల్లూరు జిల్లా)	271
కలిగిరి	(నెల్లూరు జిల్లా)	271

కేంద్రంతో మాట్లాడి పెనాల్టీలు తగ్గించిన సీఎం

అదనపు పొగాకు పంట పెనాల్టీలు లేకుండా సీఎం వైఎస్ జగన్ కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి తగ్గించారు. రైతులు మాండూస్ తుఫాన్ వల్ల కలిగిన నష్టాన్ని కనీసం కొంతైనా పూడ్చుకున్నట్లు అవుతుందని సీఎం ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. అదనపు పంటపై పొగాకు బోర్డు విధించే పెనాల్టీలు ఒక్కో రైతుపై ప్రతి సీజన్‌లో రూ.50 వేల నుంచి రూ.70 వేల వరకు విధిస్తూ వస్తోంది. రైతు పండించిన అదనపు పొగాకు అమ్మకాలపై ప్రతి రూ.100కు రూ.5 చొప్పున అపరాధ రుసుం వసూలు చేసేది.

పండుగుల్లా అదిరింది..

పొగాకు పంటలో వదిలేసే పండుగుల్ల కూడా ఇప్పుడు బంగారమైంది. గతంలో పండుగుల్లను రైతులు కూలీలకు వదిలేసేవారు. అలాంటి దానిని ఇప్పుడు రైతులే జాగ్రత్త చేసుకున్నారు. గతంలో క్వింటా రూ.2 వేలు ఉండగా నేడు రూ.8 వేల నుంచి రూ.10 వేలకు చేరింది. దీంతో చిన్న వ్యాపారుల కన్ను బయట మార్కెట్ మీద పడింది. పండుగుల్ల ఇబ్బడి ముబ్బడిగా దిగుబడి రావడంతో రైతులకు ఆర్థికంగా మేలు జరిగింది.

దేవుని మాన్యంపై పచ్చగద్ద

- ఆంజనేయస్వామి ఆలయ మాన్యం ఆక్రమణ
- మూడు ఎకరాల్లో వెంచర్ ఏర్పాటు
- మార్కెట్ విలువ రూ.3 కోట్లపైనే..



చదునుచేయించిన ఆంజనేయ స్వామి పొలం

మార్కాపురం: దేవుని మాన్యంపై టీడీపీ నేతల కన్నుపడింది. అప్పటి ప్రభుత్వంలో ఖాళీ కనిపిస్తే కబ్జా చేసిన నాయకులు ఇప్పుడు కూడా తమ వక్రబుద్ధిని పోనిచ్చుకోవడంలేదు. ఏకంగా ఆంజనేయ స్వామి పొలానికే ఎసరుపెట్టి కబ్జాచేసి ప్లాట్లు వేసి అమ్మకానికి సిద్ధం చేశారు. దీంతో ప్రజలు టీడీపీ నేతల కబ్జాపై ముక్కున వేలేసుకుంటున్నారు.

వివరాల్లోకి వెళితే...

మార్కాపురం మండలం పెద్దనాగులవరం గ్రామంలో ఆంజనేయ స్వామికి పూర్వం నుంచి మాన్యం ఉంది. ఆ పొలం ద్వారా వచ్చే ఫల సాయంతో ఆలయంలోని స్వామివారికి ధూప, దీప నైవేద్యాలు పెట్టాలి. సర్వే నంబరు 183, 199, 277, 319, 385 లలో దాదాపు 18 ఎకరాల పొలం ఉంది. మార్కాపురం పట్టణం నుంచి గుండ్లకమ్మ బ్రిడ్జి దాటగానే రోడ్డు వెంటే ఉండటంతో మార్కాపురం పట్టణానికి చెందిన ఓ టీడీపీ నేత దృష్టి దానిపై పడింది. వెంటనే తన అనుచరులను కలుపుకుని ఆ పొలాన్ని చదునుచేయించే పనిలో పడ్డాడు. మూడు రోజుల నుంచి పొక్లెయిన్లు, ట్రాక్టర్లతో దున్నించి ప్లాట్లు వేసి అమ్మకానికి సిద్ధంగా ఉంచారు. మార్కాపురం పట్టణానికి కూత వేటు దూరంలో ఉండటం, దేవుని మాన్యం అన్న విషయం తెలియకపోవడంతో పలువురు ఈ ప్లాట్లను కొనేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఇందులో సదరు టీడీపీ నేత మూడెకరాల్లో చదును చేయించినట్లు తెలుస్తోంది. ఈ స్థలాన్ని ఆనుకొని జిల్లా వైద్యశాలకు వెళ్లేందుకు ఉన్న రహదారిని కూడా ఆక్రమించాడు. సుమారు 20 అడుగుల రోడ్డు, ప్రస్తుతం 6 అడుగులకు చేరింది. టీడీపీ నేత ఆక్రమించిన ఈ భూమి మార్కెట్ విలువ రూ.3 కోట్లు ఉంటుందని అంచనా. ఇలా స్వామివారి మాన్యాన్ని కబ్జా చేయడంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సోమవారం నిర్వహించే స్పందనలో టీడీపీ నేత భూ ఆక్రమణపై ఫిర్యాదు చేసేందుకు సిద్ధమయ్యారు.

> **నా దృష్టికి రాలేదు విచారణ చేస్తా**
>
> ఈ విషయమై మార్కాపురం తహశీల్దార్ శ్రీనివాసరెడ్డిని వివరణ కోరగా పెద్ద నాగులవరం వద్ద స్వామివారి మాన్యం ఆక్రమణకు గురైనట్లు తమ దృష్టికి రాలేదని, సోమవారం విచారణ చేస్తానని పూర్తిస్థాయి చర్యలు తీసుకుంటానని తెలిపారు.
>
> – శ్రీనివాసరెడ్డి, తహశీల్దార్

ఫిష్ ఆంధ్రతో నాణ్యమైన మత్స్య ఉత్పత్తులు

- మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని



ఫిష్ ఆంధ్ర రిటైల్ షాపును ప్రారంభిస్తున్న మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాస రెడ్డి, పక్కన మేయర్ గంగాడ సుజాత తదితరులు

ఒంగోలు సబర్బన్: ప్రభుత్వ ప్రోత్సాహంతో ఏర్పాటు చేస్తున్న ఫిష్ ఆంధ్ర షాపుల్లో నాణ్యమైన మత్స్య ఉత్పత్తులు లభ్యమవుతాయని మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాస రెడ్డి అన్నారు. స్థానిక దిబ్బలరోడ్డులోని రైతు బజారులో నూతనంగా ఆదివారం ఫిష్ ఆంధ్ర షాపును బాలినేని ప్రారంభించారు. ఈ సందర్భంగా లబ్ధిదారు టి.సుభాషిణితో చేపల వ్యాపారం తీరును అడిగి తెలుసుకున్నారు. చేపలు ఎక్కడ నుంచి తెప్పిస్తారు అన్న అన్ని విషయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం షాపులోని మత్స్య ఉత్పత్తులను పరిశీలించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతే ధ్యేయంగా పాలన చేసుకుంటూ పోతున్నారని బాలినేని అన్నారు. అన్ని వర్గాల ప్రజలు ఆనందంగా, సంతోషంగా ఉండాలన్నదే సీఎం వైఎస్ జగన్ అభిమతమన్నారు. కార్యక్రమంలో ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత, వైఎస్సార్‌సీపీ నాయకులు కఠారి శంకర్, కార్పొరేటర్లు వేమూరి భవాని మాల్యాద్రి, అంబటి ప్రసాద్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

ఫుడ్ పాయిజన్‌తో ఆరుగురు చిన్నారులకు అస్వస్థత



చికిత్స పొందుతున్న చిన్నారులు



కనిగిరి రూరల్: ఫుడ్ పాయిజన్‌తో ఆరుగురు చిన్నారులు అస్వస్థతకు గురైన ఘటన కనిగిరిలో ఆదివారం జరిగింది. వివరాల్లోకి వెళ్తే..మంగలిమాన్యంకు చెందిన ఎస్‌కే బాషా అనే వ్యక్తి మనమవళ్లు, మనవరాళ్లు భద్రాచలం, సింగరాయకొండ, హైదరాబాద్ ప్రాంతాల్లో నివసించే వారు. మొహర్రం పండుగ కోసం ఇతర ప్రాంతాల నుంచి స్వగ్రామం కనిగిరి వచ్చారు. ఆ కుటుంబానికి చెందిన ఆరుగురు చిన్నారులకు మధ్యాహ్నం సుమారు ఒంటి గంట సమయంలో వాంతులు ప్రారంభమయ్యాయి. దీంతో చిన్నారులందర్నీ స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్చారు. తర్వాత వారిలో కొందరికి విరేచనాలు అయ్యాయి. హమీద్, అయిషా, రియాజ్, నఫీద్, నగ్మా, నజ్మాలు ప్రభుత్వ వైద్యశాలతో చికిత్స పొందుతున్నారు. వీరిలో పెద్ద అమ్మాయి నజ్మా, బాలుడు నఫీద్‌లు మాత్రం బాగా నీరసంగా ఉన్నారు. వాంతులు చేసుకున్న చిన్నారుల్లో ఎక్కువ శాతం మంది రాత్రి మొహర్రం పండుగ ముగింపు సందర్భంగా తయారు చేసిన ప్రసాదాన్ని ఉదయాన్నే తిన్నారు. ఆ తర్వాత దోసే, ఇడ్లి తిన్నట్లు చెప్పారు. మధ్యాహ్నం భోజనానికి ముందు చిన్నారులంతా పొటాటో చిప్స్ లాంటివి ఉన్న ప్యాకెట్లు తెచ్చుకుని తిన్నారు. కొద్ది సేపటికి అందరికీ ఒకే సారి వాంతులు ప్రారంభమయ్యాయి. దీంతో ఆందోళన చెందిన తల్లిదండ్రులు తమ చిన్నారులను స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. దీనిపై ప్రభుత్వ వైద్యురాలిని వివరణ అడగ్గా ప్రస్తుతం చిన్నారుల పరిస్థితి మెరుగ్గానే ఉందన్నారు. వారిలో ఒకరిద్దరు కొంచెం నీరసంగా ఉన్నారని తెలిపారు. అత్యవసరమైతే ఒంగోలుకు రిఫర్ చేస్తామన్నారు. తల్లిదండ్రులు ప్రాథమికంగా కాలంచెల్లిన పొటాటో చిప్స్ లాంటివి ఉన్న ప్యాకెట్లు తిన్న తర్వాతనే వాంతులు చేసుకున్నట్లు తమకు వివరించారని చెప్పారు.

వైద్యుల రక్షణ చట్టం ఘనత వైఎస్సార్‌దే

- వైద్యులు, వైద్యశాలల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలి
- ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రవి కృష్ణ



రవికృష్ణను సన్మానిస్తున్న వైద్యులు

మార్కాపురం: రాష్ట్రంలో వైద్యులకు రక్షణ చట్టం తెచ్చిన ఘనత దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డికే దక్కుతుందని ఐఎంఏ (ఇండియన్ మెడికల్ అసోసియేషన్) రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రవికృష్ణ అన్నారు. ఆదివారం మార్కాపురం ఐఎంఏ శాఖ అధ్యక్షుడు డాక్టర్ కే వంశీకృష్ణ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఐఎంఏ ప్రపంచంలోనే అతిపెద్ద వృత్తి సంఘమని, దేశంలో 1750 శాఖల్లో నాలుగు లక్షల మంది వైద్యులు సభ్యులుగా ఉన్నారని చెప్పారు. సంఘం సభ్యులు ప్రభుత్వ, ప్రైవేటు వైద్యశాలల్లో, వైద్య కళాశాలల్లో సేవలు అందిస్తున్నారన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ 2008లో దేశంలోనే మొదటిసారిగా వైద్యులపై, వైద్యశాలలపై దాడుల నిరోధానికి చట్టం తెచ్చారని, ఆ తరువాత 16 రాష్ట్రాల్లో ఇదేవిధమైన చట్టాన్ని అమలు చేశారని అన్నారు. అయితే ఈ చట్టానికి ప్రస్తుత పరిస్థితుల్లో ప్రభుత్వం కొన్ని మార్పులు చేయాలని సూచించారు. జాతీయ స్థాయిలో ఈ రక్షణ చట్టం అమలుచేస్తే బాగుంటుందని అన్నారు. ప్రైవేటు వైద్యశాలలు ఏర్పాటు చేసే సమయంలో ఉన్న వివిధ అనుమతులు, లైసెన్సులు సింగిల్‌విండో విధానంలో ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.

ఆరోగ్య శ్రీ పథకం ప్రశంసనీయం:

రాష్ట్రంలో డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య శ్రీ పథకాన్ని అమలుచేస్తూ ఆరోగ్య శ్రీ పరిధిని మరింత విస్తృతం చేసి అన్నీ రకాల జబ్బులను ఇందులో చేర్చడం, కోలుకునే సమయంలో రోగులకు ఆర్థిక సాయం ఇవ్వడం ద్వారా పేద, మధ్య తరగతి ప్రజలకు అత్యున్నత స్థాయి వైద్యం అందిస్తున్నందుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. నిధులు సకాలంలో మంజూరు చేస్తున్నందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు చెప్పారు. ఆరోగ్య శ్రీ పథకాన్ని 20 పడకల వసతి కలిగి ఉన్న వైద్యశాలలకు కూడా అనుమతి ఇవ్వాలన్నారు. శిక్షణ లేని వైద్యం చేస్తున్న క్లినిక్‌లపై చర్యలు తీసుకోవాలన్నారు. ఐఎంఏ ద్వారా నిరంతర సామాజిక సేవలు చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఆయనతోపాటు సీనియర్ వైద్యులు ప్రభాకర్, లక్ష్మీరెడ్డి, మస్బుల్ బాషాలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డాక్టర్లు శరత్, ఫణీంద్రారెడ్డి, మాధవరావు, రాంబాబు, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

చౌక ధరలకు బ్రాండెడ్ వస్తువులా..నమ్మొద్దు

- ఎస్పీ మలికా గర్గ్

ఒంగోలు టౌన్: పేరొందిన కంపెనీలకు చెందిన బ్రాండెడ్ వస్తువులను అత్యంత చౌక ధరలకు విక్రయిస్తున్నట్లు వచ్చే ప్రకటనలు చూసి బుక్ చేశారా ఇంతే సంగతులు. మీ డబ్బులు మాయం కావడం తప్పితే మీరు బుక్ చేసిన వస్తువులు మాత్రం మీ ఇంటికి రావు. ఇలాంటి మోసాలు నిత్యం జరుగుతున్నాయి. ఈ క్రమంలో ప్రకాశం జిల్లా ఎస్పీ మలికా గర్గ్ నకిలీ ఈ కామర్స్ సైట్ల పట్ల ప్రజలను అప్రమత్తం చేస్తూ ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆషాఢం, శ్రావణ మాస సేల్, వివిధ పండుగలను టార్గెట్ చేసుకొని కొందరు సైబర్ నేరగాళ్లు మోసాలకు పాల్పడుతున్నారని ఎస్పీ తెలిపారు. అమేజాన్, బిగ్ బజార్, ఫ్లిప్‌కార్ట్, డీ మార్ట్, బిగ్ బాస్కెట్ వంటి ఒరిజనల్‌కు పోలిఉండే వెబ్ సైట్లను పేజ్ జాకింగ్ అనే పద్ధతి ద్వారా సృష్టిస్తున్నారని వెల్లడించారు. నిత్యావసర వస్తువులు, గృహాలంకరణ వస్తువులు, ప్రముఖ బ్రాండెడ్ దుస్తులు, ఎలక్ట్రానిక్ పరికరాలపై 50 నుంచి 90 శాతం డిస్కౌంట్ ఇస్తున్నట్లు మీడియా వెబ్‌సైట్లలో ప్రచారం చేస్తున్నారని తెలిపారు. ఇలాంటి వాటికి నమ్మి తక్కువ ధరలకు వస్తున్నాయని, కొనుగోలు చేస్తే తద్వారా క్రెడిట్, డెబిట్ కార్డుల వివరాలను సేకరించి బ్యాంకు ఖాతాల నుంచి డబ్బులను ఖాళీ చేస్తున్నారని చెప్పారు.

జర్నలిస్టుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

- ప్రభుత్వం మీద బురదజల్లే పనిగా పెట్టుకున్న ఒక వర్గం పత్రికలు
- సీఆర్ ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని



మాట్లాడుతున్న కొమ్మినేని

మార్కాపురం: రాష్ట్ర ప్రభుత్వం జర్నలిస్టుల సంక్షేమానికి కృషి చేస్తుందని సీ రాఘవాచారి ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం మార్కాపురం ప్రెస్‌క్లబ్‌లో వర్కింగ్ జర్నలిస్టులతో నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. ఇప్పటి వరకూ ఏ ప్రభుత్వం చేయని విధంగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం రాష్ట్రంలోని జర్నలిస్టులకు వృత్తిపరమైన శిక్షణ ఇచ్చేందుకు ప్రతి శనివారం జూమ్ మీటింగ్ నిర్వహిస్తున్నామని తెలిపారు. జర్నలిస్టులు పుస్తక పఠనంతో పాటు రచనలు కూడా చేయాలని, తమలోని ప్రతిభను వెలికితీసుకునేందుకు ఎప్పటికప్పుడు ప్రయత్నిస్తుండాలన్నారు. జర్నలిస్టులకు ఆరోగ్య శ్రీ కింద వైద్య చికిత్సలు అందించేందుకు తాను ఆరోగ్య శ్రీ ట్రస్టు చైర్మన్‌తో మాట్లాడి హెల్ప్‌లైన్ 104 నంబరులో ప్రత్యేక సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. జర్నలిస్టుల రచనలు గ్రంథాలయాల్లో అందుబాటులో ఉండేలా చూడాలని గ్రంథాలయ పరిషత్ కమిషనర్‌ను కోరగా అంగీకరించారని చెప్పారు. మార్కాపురంలో జర్నలిస్టులకు ఇళ్ల పట్టాలు ఇచ్చేందుకు సహకరించిన ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

ప్రభుత్వంపై బురదజల్లడంపైనే దృష్టి

తాను ఏ పత్రికనైనా ఫలానా వార్త రాయవద్దని చెప్పనని, అయితే రాష్ట్రంలో ఒక వర్గం పత్రికలు ప్రభుత్వంపై బురదజల్లేలా రాతలు రాస్తున్నాయని అన్నారు. తెలంగాణలో వర్షాలు పడితే ఒక రకంగా, మన రాష్ట్రంలో వర్షం పడితే మరోలా అవే పత్రికలు వార్తలు రాయడాన్ని ఆయన ఆక్షేపించారు. ఎప్పటికప్పుడు పాత్రికేయులు సమాజంలో వస్తున్న మార్పులను గుర్తించాలని సూచించారు. రచనా నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలన్నారు. అనంతరం సీనియర్ పాత్రికేయులను సన్మానించారు. లక్ష్మీ చెన్నకేశవస్వామి దేవాలయంలో పూజలు నిర్వహించిన అనంతరం వెలిగొండ ప్రాజెక్టులో భాగంగా గొట్టిపడియ, సుంకేశుల గ్యాప్‌లను సందర్శించారు. ఆయన వెంట సీనియర్ పాత్రికేయులు ఓఏ మల్లిక్, ప్రెస్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు మోహన్‌రెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, ఐజేయూ సభ్యులు ఎస్‌వీ రమణ, సీనియర్ పాత్రికేయులు పాల్గొన్నారు. కేఎస్‌ఆర్‌ను ప్రెస్‌క్లబ్ తరఫున ఘనంగా సన్మానించారు.

క్లుప్తంగా

బైక్‌లు ఢీకొని వ్యక్తి మృతి



మృతిచెందిన భాస్కర్‌రెడ్డి

గిద్దలూరు రూరల్: రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొని ఒక ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న వ్యక్తి మృతిచెందిన సంఘటన గిద్దలూరు మండలంలోని బురుజుపల్లె తండా సమీపంలో ఆదివారం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో గిద్దలూరు మండలం కొత్తకోట గ్రామానికి చెందిన భాస్కర్‌రెడ్డి (45) అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

విద్యుదాఘాతంతో బోరు కార్మికుడు మృతి



మృతిచెందిన కార్మికుడు ఆగస్‌సింగ్

త్రిపురాంతకం: విద్యుదాఘాతంతో బోరు కార్మికుడు మృతిచెందిన సంఘటన మండల పరిధిలోని అన్నసముద్రం వద్ద ఆదివారం చోటుచేసుకుంది. బోరు బండికి గ్రీజు కొట్టే సమయంలో బండికి విద్యుత్ తీగలు తగలడంతో మధ్యప్రదేశ్‌కు చెందిన కార్మికుడు ఆగస్‌సింగ్ (40) షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందాడు. సంఘటన స్థలాన్ని పరిశీలించిన ఎస్సై సుమన్ విచారణ చేపట్టారు.



దర్శి ప్రభుత్వాస్పత్రి



నిర్మాణం పూర్తి చేసుకున్న నూతన భవనం



ప్రస్తుత డాక్టర్ల గదులు

వైద్యం.. మరింత మెరుగ్గా..!

- దర్శి సీహెచ్‌సీని అభివృద్ధి చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం
- ఇప్పటికే 30 నుంచి 50 పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్
- తాజాగా రూ.2.10 కోట్లతో నూతన భవనం సిద్ధం
- అధునాతన సౌకర్యాలు, వైద్య సిబ్బంది ఏర్పాటు
- మెరుగైన వైద్యసేవలు అందనుండటంతో ప్రజల హర్షం

దర్శి: ప్రతి పేదవాడికి మెరుగైన వైద్యం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోంది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వైద్య రంగానికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తోంది. ప్రభుత్వ వైద్య రంగంపై సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించి భారీగా నిధులు కేటాయించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో అభివృద్ధి పనులు చేపట్టడంతో పాటు వైద్య సిబ్బందిని నియమించి ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందిస్తున్నారు. అందులో భాగంగా గతంలో 30 పడకల ఆస్పత్రిగా ఉన్న దర్శి కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ)ని 50 పడకల ఆస్పత్రిగా మార్చారు. రూ.2.10 కోట్ల నిధులతో 12 ప్రత్యేక గదులతో కూడిన రెండంతస్తుల నూతన భవన నిర్మాణం చేపట్టి పూర్తి చేశారు. వైద్యారోగ్య శాఖామంత్రి విడదల రజని, స్థానిక ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్ ప్రత్యేక దృష్టి సారించి నూతన భవన నిర్మాణంతో పాటు వైద్య సిబ్బంది కొరత లేకుండా చర్యలు చేపట్టారు. ఫలితంగా దర్శి సీహెచ్‌సీ ద్వారా స్థానిక ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందనుండటంపై హర్షం వ్యక్తం చేస్తున్నారు.

గత ప్రభుత్వ హయాంలో వైద్యం కరువు...

దర్శి సీహెచ్‌సీలో ఐదు వైద్యుల పోస్టులకుగానూ గత టీడీపీ ప్రభుత్వంలో ఒకే ఒక్క డాక్టర్‌తో వైద్య సేవలు అందించారు. నర్సుల పోస్టులు కూడా ఐదు ఉండాల్సి ఉండగా ఇద్దరు మాత్రమే ఉండే వారు. సరైన వసతులు లేకపోవడంతో రాత్రి 8 గంటలు దాటితే గేట్లకు తాళాలు వేసుకుని లోపల బిక్కుబిక్కుమంటూ నర్సులు గడిపేవారు. అరకొరగా కూడా వైద్యం అందే పరిస్థితి లేకపోవడంతో అప్పట్లో ఈ ప్రభుత్వాస్పత్రికి వచ్చి వైద్యం చేయించుకునే వారు కూడా చాలా తక్కువగా ఉండేవారు. రాత్రివేళ ప్రమాదాలు జరిగితే అత్యవసర చికిత్స అందించే పరిస్థితులు కూడా ఉండేవి కావు. అవసరమైన మందులు కూడా లేకపోవడం, ఎక్స్‌రే పరికరం పనిచేయకపోవడం, రక్త పరీక్షలు వంటి సేవలు లేకపోవడంతో కనీస వైద్యం కరువై వామ్మో దర్శి ప్రభుత్వాస్పత్రా..! అనుకునే పరిస్థితి ఉండేది.

ప్రస్తుతం వైద్య సేవలు రెట్టింపు...

టీడీపీ హయాంలో వామ్మో ప్రభుత్వ ఆస్పత్రా అనే పరిస్థితి నుంచి వైఎస్సార్ సీపీ హయాంలో ఆహా ప్రభుత్వ ఆస్పత్రి అనే స్థాయికి దర్శి సీహెచ్‌సీ మారిపోయింది. ఆస్పత్రిలో సమూల మార్పులు చేసి ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నారు. ప్రస్తుతం ఆర్థోపెడిక్ సేవలు సైతం అందుతున్నాయంటే ఆస్పత్రిలో ఏ స్థాయిలో మార్పులు జరిగాయో అర్థం చేసుకోవచ్చు. సూపరింటెండెంట్ కే ఆంజనేయులు ఆర్థోపెడిక్ సేవలు అందిస్తుండగా, కంటి వైద్యులు గీతాపద్మ, జనరల్ సర్జన్ టీ సుమన్, జనరల్ వైద్యులు సక్రునాయక్, మాధవీలత, ఈఎన్‌టీ వైద్యులు సుభాష్‌చంద్రబోస్, గైనికాలజిస్ట్ సుప్రియ, లక్ష్మీపూజిత, మత్తు డాక్టర్ షమిక్ అహ్మద్, డెంటల్ వైద్యుడు డాక్టర్ చంద్రకాంత్ నిత్యం ఆస్పత్రిలో వైద్య సేవలందిస్తూ ప్రజల మన్ననలు పొందుతున్నారు. ప్రస్తుతం 11 మంది స్టాఫ్ నర్సులు సేవలందిస్తున్నారు. ల్యాబ్‌టెక్నీషియన్‌లు, ఆయాలు, దోబీలు, వాచ్‌మెన్‌లు కలిపి మొత్తం 70 మందికిపైగా సిబ్బంది ఆస్పత్రిలో పనిచేస్తున్నారు.



ప్రస్తుత ఆస్పత్రిలోని ఓపీ విభాగం

24 గంటలూ వైద్యం...

అర్ధరాత్రి ఆస్పత్రికి వెళ్లినా వైద్యం అందేలా 24 గంటల పాటు వైద్యులు, సిబ్బంది డ్యూటీల ప్రకారం అందుబాటులో ఉంటున్నారు. వచ్చిన రోగులకు తగిన గౌరవం ఇస్తూ దీర్ఘకాలిక ఆరోగ్యంపై సైతం పలు సలహాలు, సూచనలు చేస్తున్నారు. కు.ని.ఆపరేషన్లు, ప్రసవాలు, ఇతర ఆపరేషన్లు కూడా ఆస్పత్రిలోనే చేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో 80 నుంచి 100 ఓపీలు మాత్రమే వచ్చేవి. ప్రస్తుతం 200 నుంచి 250 ఓపీలు వస్తున్నాయి.



నూతన భవనంలోని ప్రత్యేక విభాగాలు

అన్ని రకాల పరీక్షలు అందుబాటులో...

ఆస్పత్రిలో అందుబాటులో ఉన్న వైద్య విభాగాలకు సంబంధించిన అన్నిరకాల రక్త పరీక్షలు, ఎక్స్‌రేలు, గర్భిణులకు స్కానింగ్‌తో పాటు అధునాతన ఆపరేషన్ థియేటర్ కూడా ఉండటంతో పాటు రక్తాన్ని నిల్వ ఉంచే సౌకర్యం కూడా ఉంది. ఇతర అధునాతన పరికరాలు సైతం అందుబాటులో ఉన్నాయి. దీంతో కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు, జనరల్ ఆపరేషన్లు, ఆర్థోపెడిక్ సేవలు కూడా ప్రజలకు అందుతున్నాయి. అవసరాన్ని బట్టి ప్రత్యేక విభాగాల వైద్యులు వచ్చివెళ్తున్నారు.

12 గదులతో ప్రారంభానికి సిద్ధంగా నూతన భవనం...

దర్శి సీహెచ్‌సీని 50 పడకల ఆస్పత్రిగా మార్చడంతో పాటు రూ.2.10 కోట్లతో నూతన భవనం నిర్మించారు. అందులో మొత్తం 12 గదులకుగానూ రెండు ఆపరేషన్ థియేటర్లు, రెండు వార్డులు, రెండు వైద్యుల ఓపీ గదులు, ఒక ల్యాబ్ రూం, ఒక కాన్పుల ప్రత్యేక గది, వైద్యులు, నర్సులకు రెండు వేరు వేరు వ్యక్తిగత గదులు, స్టెరిలైజేషన్ రూం, పిల్లలకు స్పెషల్ కేర్ యూనిట్ గది ఏర్పాటు చేశారు. వాటిలో అధునాతన టెక్నాలజీ, వసతులు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం పెయింటింగ్ వేస్తున్నారు. రెండంతస్తుల ఆస్పత్రి నిర్మించి స్ట్రెచ్చర్‌పైనే రోగులను పైఅంతస్తుకు తీసుకెళ్లే విధంగా ప్రత్యేక రెయిలింగ్, నడిచి వెళ్లేందుకు మెట్లు ఏర్పాటు చేశారు. ఆస్పత్రికి సంబంధించిన ఫర్నిచర్, ల్యాబ్ పరికరాలు, ఇతర నూతన సామగ్రి మొత్తం వచ్చి సిద్ధంగా ఉంది. ప్రారంభించడమే తరువాయి.

> **నూతన భవనం సిద్ధమైంది**
>
> 
>
> అన్ని వసతులతో దర్శి సీహెచ్‌సీ నూతన భవనం ప్రారంభానికి సిద్ధమైంది. స్థానిక ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్‌ను సంప్రదించి ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు చేస్తాం. కొత్త ఫర్నిచర్ కూడా వచ్చింది. నూతన భవనంలోకి వెళితే మరింత సౌకర్యవంతంగా ఉంటుంది. వైద్య సిబ్బంది కొరత కూడా లేదు. ప్రజలకు అన్ని రకాల వైద్య సేవలు మెరుగ్గా అందిస్తున్నాం.
>
> – కే ఆంజనేయులు, సూపరింటెండెంట్, దర్శి సీహెచ్‌సీ

వివాహిత ఆత్మహత్య



చెట్టుకు వేలాడుతున్న నూర్ అప్సర మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు



నూర్ అప్సర (ఫైల్)

- చెట్టుకు ఉరేసుకునే ముందు భర్తకు ఫొటోలు పంపిన వైనం
- భర్త వేధింపులే కారణమని చర్చ

ముండ్లమూరు: వేప చెట్టుకు ఉరేసుకుని వివాహిత ఆత్మహత్య చేసుకున్న సంఘటన ముండ్లమూరులో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... ముండ్లమూరుకు చెందిన షేక్ కాలేషా, మహబూబి దంపతుల రెండో కుమార్తె నూర్ అప్సర అలియాస్ బుజ్జి (27) తండ్రి ఆమె చిన్నతనంలోనే మృతి చెందాడు. అద్దంకి మండలం వేలమూరిపాడు గ్రామానికి చెందిన ఎస్సీ యువకుడు కాలింత కిరణ్‌కుమార్‌ను ప్రేమించి పెద్దలను ఎదిరించి వివాహం చేసుకుంది. కొంతకాలానికి తల్లి కూడా మరణించింది. కొన్నేళ్లపాటు వీరి కాపురం సజావుగానే సాగింది. కిరణ్‌కుమార్ అద్దంకిలోని బంగ్లా రోడ్లో ఫొటోస్టూడియో నిర్వహిస్తున్నాడు. నూర్‌అప్సర ప్రైవేట్ పాఠశాలలో పనిచేస్తోంది. ఇటీవల దంపతుల మధ్య తరచూ గొడవలు చోటుచేసుకుంటున్నాయి. దీంతో నూర్‌అప్సరను కిరణ్‌కుమార్ వేధిస్తున్నాడు. ఈ నేపథ్యంలో శనివారం రాత్రి భార్యాభర్తల మధ్య మరోసారి గొడవ జరిగినట్లు చుట్టుపక్కల వారు తెలిపారు. మనస్తాపం చెందిన నూర్ అప్సర ఆదివారం ఉదయం వేలమూరిపాడు నుంచి ముండ్లమూరు వచ్చింది. పిల్లలు తొమ్మిదేళ్ల నిషిత, ఏడేళ్ల సంగీత ఏడుస్తూ వెంటపడినా పట్టించుకోకుండా వారిని అక్కడే వదిలేసి వచ్చింది. ముండ్లమూరులోని తమ ఇంటి ఆవరణలో ఉన్న వేపచెట్టుకు అట్లతద్దె సమయంలో ఏర్పాటు చేసిన ఊయల తాడుకు ఉరేసుకునేందుకు సిద్ధమైంది. మధ్యాహ్నం రెండు గంటల సమయంలో అటుగా వెళ్తున్న ఎస్సీకాలనీకి చెందిన ఒక మహిళ నూర్ అప్సర వద్దకు వచ్చి కాసేపు కూర్చుని వెళ్లింది. పక్కనే చర్చి ఉండటంతో ఆదివారం ప్రార్థనలకు వచ్చిన మహిళలు ఇళ్లకు వెళ్లేంత వరకు ఆగింది. ఆ ప్రాంతంలో నిరుపయోగంగా ఉన్న తొట్టెను వేప చెట్టుకు వేలాడుతున్న తాడు వద్దకు తెచ్చుకుని మెడలో ఉన్న బంగారు భరణాలు హ్యాండ్‌బ్యాగ్‌లో వేసి ఉరేసుకుంది. ఉరేసుకునే ముందు భర్తకు చెట్టుకు వేలాడుతున్న తాడు ఫొటో, ఆ ప్రాంతం ఫొటోలను వాట్సాప్‌లో పంపినట్లు తెలిసింది. చెట్టుకు మృతదేహం వేలాడుతుండగా, సాయంత్రం అటుగా వెళ్లిన కొందరు చూసి చుట్టుపక్కల వాళ్లకు చెప్పారు. రోడ్డు పక్కనే కావడంతో స్థానికులు మృతదేహాన్ని చూసేందుకు గుమిగూడారు. సమాచారం తెలుసుకున్న ఎస్సై యూవీ కృష్ణయ్య సిబ్బందితో అక్కడికి చేరుకుని వీఆర్వో ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దర్శి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతురాలికి ముగ్గురు తోడబుట్టిన వారు ఉన్నారు. కులాంతర వివాహం చేసుకోవడంతో మృతదేహాన్ని చూసేందుకు బంధువులెవరూ ముందుకురాలేదు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం



రాజశేఖరరెడ్డి మృతదేహం



గాయపడిన శివాజీ

- మరొకరికి తీవ్రగాయాలు

పొదిలి: స్థానిక మార్కాపురం అడ్డరోడ్డుపై రైస్ గోడౌన్ వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక యువకుడు మృతి చెందగా, మరొక యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. ఒంగోలుకు చెందిన డాకా రాజశేఖరరెడ్డి (27) సెంట్రింగ్ పనులు చేస్తుంటాడు. పొదిలికి చెందిన ఏడుకొండలు, శివాజీ అనే వ్యక్తులు కూడా అతనితో పనులకు వెళ్తుంటారు. కొనకనమిట్ల మండలంలోని వద్దిమడుగు గ్రామంలో పని మాట్లాడుకునేందుకు రాజశేఖరరెడ్డి, శివాజీ, ఏడుకొండలు ముగ్గురూ కలిసి మోటారు సైకిల్‌పై మార్కాపురంవైపు వెళ్తున్నారు. ఎదురుగా వచ్చిన ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో కిందపడి రాజశేఖరరెడ్డి, శివాజీ తీవ్రంగా గాయపడ్డారు. 108 వాహనంలో స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అప్పటికే రాజశేఖరరెడ్డి మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. తీవ్రంగా గాయపడిన శివాజీకి ప్రాథమిక వైద్యం అనంతరం మెరుగైన వైద్యం కోసం ఒంగోలు తరలించారు. సంఘటన స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఇంజినీరింగ్ విద్యార్థి మృతి



లింగారెడ్డి (ఫైల్)

ఎమ్మిగనూరు రూరల్ (కర్నూలు): రోడ్డు ప్రమాదంలో గాయపడిన లింగారెడ్డి (21) అనే ఇంజినీరింగ్ విద్యార్థి కర్నూలు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి శనివారం అర్ధరాత్రి మృతి చెందాడు. ప్రకాశం జిల్లా రాచర్ల మండలం ఆకవీడు గ్రామానికి చెందిన భాస్కర్‌రెడ్డి, శ్రీదేవి దంపతుల ఒక్కగానొక్క కుమారుడు లింగారెడ్డి (21).. ఎమ్మిగనూరు మండలం ఎర్రకోట సెయింట్ జాన్స్ కాలేజీలో బీటెక్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. భాస్కర్‌రెడ్డి సోదరుడు వినోద్ ఆదోనిలో ఉండటంతో లింగారెడ్డి అక్కడే ఉంచాడు. రోజూ బస్సులో కాలేజీకి వెళ్లివస్తున్నాడు. శుక్రవారం ఆదోని నుంచి తన స్నేహితుడి బైక్ తీసుకుని కాలేజీకి వెళ్లాడు. ఎమ్మిగనూరు సమీపంలోని షాదీఖానా దగ్గర ఎదురుగా వచ్చి ఆర్టీసీ బస్సు ఢీకొనటంతో బైక్‌పై ఉన్న లింగారెడ్డితో పాటు మరో విద్యార్థికి గాయాలయ్యాయి. లింగారెడ్డి పరిస్థితి విషమంగా ఉండటంతో రెండు రోజులు ప్రైవేటు హాస్పిటల్‌లో చికిత్స అందించారు. బతకడం కష్టమని వైద్యులు తెలపడంతో అక్కడి నుంచి కర్నూలు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ లింగారెడ్డి మృతిచెందాడు. ఒక్కగానొక్క కుమారుడు మృతి చెందడంతో తల్లిదండ్రులు దుఃఖ సాగరంలో మునిగిపోయారు. ఆదివారం మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి ఆకవీడు తరలించినట్లు ట్రాఫిక్ ఏఎస్‌ఐ నటరాజ్ తెలిపారు.

పీర్ల పండుగకు స్నేహితుడి ఇంటికొచ్చి వెళ్తూ...

- బైక్ అదుపుతప్పి ఆటోడ్రైవర్ మృతి



మృతిచెందిన అంకాలు

పుల్లలచెరువు: పీర్ల పండుగకు స్నేహితుడి ఇంటికొచ్చి వెళ్తూ మోటార్ సైకిల్ అదుపుతప్పి ఆటోడ్రైవర్ మృతిచెందిన సంఘటన పుల్లలచెరువు మండలంలోని శతకోడు గ్రామంలో ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది. త్రిపురాంతకం మండలంలోని అన్నసముద్రం గ్రామానికి చెందిన మాలపాటి అంకాలు (50) శతకోడులో ఉన్న స్నేహితులు, బంధువుల వద్దకు పీర్ల పండుగకు శనివారం వచ్చాడు. ఆదివారం తిరుగు ప్రయాణంలో ఊరి మలుపు వద్ద బైక్ అదుపుతప్పి రోడ్డు పక్కనున్న కాలువలో పడింది. చుట్టుపక్కల వారు వచ్చి చూసేసరికి అంకాలు మృతిచెంది ఉన్నాడు. అతనికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఆటో నడుపుతూ జీవిస్తున్నాడు. ఎస్‌ఐ శ్రీహరి సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

విద్యుత్ షాక్‌కు రైతు బలి



రైతు బాలవెంకటేశ్వరరావు మృతదేహం

ముండ్లమూరు: విద్యుత్ షాక్ కొట్టి రైతు మృతిచెందిన సంఘటన మండలంలోని వేంపాడు గ్రామంలో ఆదివారం జరిగింది. మృతుడి కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన మేదరమెట్ల బాలవెంకటేశ్వరరావు (36) తన పొలంలో మందు చల్లేందుకు మందు బస్తాలు తీసుకెళ్తున్నాడు. గట్టుపై నడుచుకుంటూ వెళ్తుండగా కాలు జారి గట్టు పక్కనే ఉన్న విద్యుత్ స్తంభం ఎర్త్ తీగపై పడ్డాడు. దీంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. అదే సమయంలో పక్క పొలంలో వ్యవసాయ పనులు చేస్తున్న గండి అబ్రహాం గమనించి అక్కడికి వచ్చి కర్రతో బాలవెంకటేశ్వరరావును పక్కకు నెట్టాడు. అప్పటికే మృతి చెందడంతో కుటుంబ సభ్యులకు సమాచారం అందించాడు. కుటుంబ సభ్యులు పొలానికి వెళ్లి మృతదేహాన్ని ఇంటికి తీసుకొచ్చారు. మృతునికి భార్య భాగ్యలక్ష్మి, ఇంటర్ చదువుతున్న కుమారుడు సూర్యతేజ ఉన్నారు. సమాచారం తెలుసుకున్న ఎస్సై యూవీ కృష్ణయ్య సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ప్రమాదానికి గల కారణాలను కుటుంబ సభ్యులతో మాట్లాడి తెలుసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు స్టేషన్ హౌస్ ఆఫీసర్ బీ వెంకటేశ్వరరావు తెలిపారు.

చెరువులో ఈతకు వెళ్లి విద్యార్థి మృతి



చెరువు వద్ద మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఏఎస్సై వెంకట్రావు

చీమకుర్తి: చెరువులో ఈతకు వెళ్లి విద్యార్థి మృతిచెందిన సంఘటన సంతనూతలపాడులోని చిన్నచెరువు వద్ద శనివారం సాయంత్రం జరగ్గా ఆదివారం ఉదయం వెలుగులోకి వచ్చింది. పోలీసులు, విద్యార్థి తండ్రి నారాయణ తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన దార్ల బాల వెంకటేశ్వర్లు (16) గతేడాది పదో తరగతి ఫెయిలయ్యాడు. ఒక సబ్జెక్టు మిగిలిపోవడంతో ఇంటి వద్దే ఉండి చదువుకుంటున్నాడు. శనివారం కూడా పాఠశాలకు సెలవు కావడంతో తోటి స్నేహితులతో కలిసి చేపలు పట్టుకుందామంటూ చెరువు వద్ద వెళ్లి ఈతకు దిగారు. చెరువు లోపల గుంతలో చిక్కుకుని బాలవెంకటేశ్వర్లు మునిగిపోగా, మిగిలిన నలుగురు స్నేహితులు అది చూసి భయపడి ఇంటికి వెళ్లిపోయారు. జరిగిన సంఘటన గురించి బాలవెంకటేశ్వర్లు తల్లిదండ్రులకు కూడా చెప్పలేదు. మృతుడి తండ్రి నారాయణ, కుటుంబ సభ్యులు శనివారం పగలు, రాత్రంతా వెతికి ఆదివారం తెల్లవారుజామున నారాయణ ఇంటి పక్కనే ఉన్న పిల్లలను గట్టిగా అడగటంతో జరిగిన సంఘటన గురించి చెప్పారు. వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చి చెరువు వద్ద వెతకడం మొదలుపెట్టారు. సాయంత్రానికి బాలవెంకటేశ్వర్లు మృతదేహం చెరువు ఒడ్డుకు తేలడంతో ఏఎస్సై వెంకట్రావు మృతదేహాన్ని బయటకు తీయించి పోస్ట్‌మార్టం నిమిత్తం ఒంగోలు జీజీహెచ్‌కి తరలించారు. నారాయణకు నలుగురు ఆడపిల్లల తర్వాత బాలవెంకటేశ్వర్లు పుట్టాడు. ఒక్కగానొక్క మగబిడ్డ మృతిచెందడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. నారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

రైలు కింద పడి వ్యక్తి మృతి



రావి అంజయ్య

టంగుటూరు: వాకింగ్‌కు వెళ్లి వస్తూ ప్రమాదవశాత్తు రైలు కింద పడి వృద్ధుడు మృతి చెందిన సంఘటన టంగుటూరు రైల్వే స్టేషన్లో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు టంగుటూరు విష్ణాలయం వీధికి చెందిన రావి అంజయ్య (67) రైల్వే స్టేషన్లో ఉదయం, సాయంత్రం వాకింగ్ చేస్తూ ఉంటాడు. రోజూ లాగే వాకింగ్ ముగించుకొని ఇంటికి వెళ్లేందుకు రెండో ప్లాట్‌ఫాం నుంచి ఒకటో ప్లాట్‌ఫాంకు వస్తుండగా పట్టాలపై గూడ్సు రైలు నిలిచి ఉంది. దీంతో రైలు కింద నుంచి దూరి వెళ్లేందుకు ప్రయత్నించగా రైలు ఒక్కసారిగా ముందుకు కదిలింది. ఈ క్రమంలో పట్టాలపై పడిపోగా, ఆయనపై నుంచి రైలు వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఒంగోలు రైల్వే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు.